
ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY




నల్లగొండ

5

సోమవారం 29 జనవరి 2024

పెట్టుబడుల కోసం

రైతుల గోస



- రైతుబంధు సహాయం ప్రారంభించి 48 రోజులు
- ఉమ్మడి జిల్లాకు వచ్చింది రూ.324కోట్ల పైచిలుకే
- ఖజానా ఖాళీతో నానా తంటాలు
- యాసంగిలో పెట్టుబడులు లేక ఇబ్బందులు
- రుణమాఫీపై స్పష్టత కరువు

నల్లగొండ, జనవరి 28: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందజేయాల్సిన పెట్టుబడి సాయం విషయంలో నాన్పుడి ధోరణి అవలంభిస్తోంది. ఎన్నికలకు ముందే రైతుబంధు సాయం అందాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ జోక్యంతో ఆ ప్రక్రియ నిలిచింది. దీంతో రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే డిసెంబరు 6వ తేదీ నుంచి పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించింది. అయితే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానా ఖాళీగా ఉందని ప్రకటించింది. అయితే ప్రతిపక్షాలు, రైతుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 11వ తేదీ నుంచి రైతుబంధు సాయాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించింది. అయినప్పటికీ రైతుబంధు సాయం పూర్తిగా నత్త నడకన సాగుతుంది. కనీసం ఐదు ఎకరాల వరకు ఇప్పటి వరకు రైతులకు సాయం అందని పరిస్థితి. దీంతో యాసంగిలో రైతులు సాగు చేయడానికి చేతిలో పెట్టుబడి లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో అందరి రైతులకు రైతుబంధు అందజేస్తామని ప్రకటించింది. దీంతో మరిన్ని రోజులు రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాకు వచ్చింది రూ.324కోట్ల పైచిలుకే..

కొత్త ప్రభుత్వం రైతుబంధు సాయం ప్రారంభించి 48 రోజులు కావస్తున్నా ఏమాత్రం ముందుకు సాగడంలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మొత్తం రూ.1450కోట్లకు పైగా రావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.324కోట్ల పైచిలుకు మాత్రమే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. నల్లగొండ జిల్లాకు సంబంధించి 3,03,885మంది రైతుల ఖాతాలో ఇప్పటివరకు రూ.161.95కోట్ల పైచిలుకు జమ చేశారు. యాదాద్రి జిల్లాకు సంబంధించి 1,48,080మంది రైతుల ఖాతాలో రూ.71.52కోట్లు, సూర్యాపేట జిల్లాలో 1,75,064మంది రైతుల ఖాతాలో రూ.92.52 కోట్లు జమయ్యాయి. దీంతో రైతుబంధు పథకం అమలవుతుందా? లేదా? సందేహంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతీ ఏడాది ఎకరానికి రెండు పంటలకు రూ.15వేలు వేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇప్పటివరకు దానికి సంబంధించిన ప్రణాళిక రూపొందకపోగా పాత ప్రభుత్వం అమలుచేసిన రైతుబంధు సాయాన్ని సైతం కొనసాగించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వం మొత్తం 11విడతల్లో రైతుబంధు సాయాన్ని అందించింది. దీంతో రైతులకు పెట్టుబడులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. నూతన ప్రభుత్వం అంతకు మించి రైతుబంధు సాయాన్ని అందిస్తుందని భావిస్తే ఆశలు ఆవిరయ్యాయనే భావనలో రైతులు ఉన్నారు.

రుణమాఫీపై స్పష్టత కరువు

గత ప్రభుత్వం నిధుల కొరతతో రుణమాఫీని మధ్యలోనే ఆపివేయగా కొత్త ప్రభుత్వం రుణమాఫీపై నేటికీ స్పష్టత ఇవ్వడంలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఎన్నికలకు ముందు రూ.లక్షవరకు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రూ.లక్షను ఒకేసారి మాఫీ చేయలేమని చెప్పిన నాటి ప్రభుత్వం రూ.25వేల చొప్పున, మరుసటి ఏడాది రూ.50వేలు, ఆ తరువాత రూ.75వేలు, ఆ తర్వాత రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదు. దీనికితోడు రైతుల రుణాలపై వడ్డీ పేరుకుపోయింది. 2023 ఎన్నికల ఏడాది కావడంతో అనూహ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగస్టు 15నుంచి రుణమాఫీ ప్రక్రియను తిరిగి మొదలుపెట్టింది. అయితే అది కూడా పూర్తిస్థాయిలో అమలుకు నోచలేదు. రూ.99,999 వరకు అంటే రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తామని చెప్పినప్పటికీ కొంతమందికే రుణమాఫీ కాగా, వేలాది మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయలేదని సమాచారం.

రుణమాఫీపై ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు

రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం సమీక్ష నిర్వహించిన అనంతరం మార్గదర్శకాలు విడుదలచేసే అవకాశాలున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రుణమాఫీ నిధులను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుంది. అదేవిధంగా రైతుబంధు నిధులు ప్రతీ రోజు రైతుల ఖాతాలో జమవుతున్నాయి. మొత్తం రైతులందరికీ రైతుబంధు సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

సర్పంచ్‌ల ఆశలు ఆవిరి



- ఏకగ్రీవ పంచాయతీలకు దక్కని నజరానా
- ఐదేళ్ల పాలన ముగుస్తున్నా నేటికీ అందని వైనం
- మూడు రోజుల్లో పదవులను కోల్పోనున్న పాలకవర్గం
- ఈ ప్రభుత్వమైనా విడుదల చేయాలని సర్పంచ్‌ల వేడుకోలు

నల్లగొండ, జనవరి 28: మరో మూడు రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుంది. కాగా, ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.10లక్షల నజరానా నేటికీ అందలేదు. దీంతో పదవి నుంచి దిగనున్న సర్పంచ్‌ల ఆశలు ఆవిరయ్యాయి.

గ్రామపంచాయతీల పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.10లక్షల నజరానా ఇస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గ్రామ అభివృద్ధి కోసం నాయకులు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ఐదేళ్లు కాగా, వారి పాలనా కాలం ముగుస్తున్నా నేటికీ ప్రభుత్వ నజరానా అందలేదు. ఉమ్మడి జిల్లాలో 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. కాగా, ఈ ఏడాది ప్రస్తుత నెలాఖరుతో పంచాయతీల పాలకవర్గం గడువు ముగియనుంది. అయితే నజరానాల విషయంలో గత ప్రభుత్వం ప్రకటన చేసినా, జీవో మాత్రం జారీ చేయలేదు. ఆ నిధులను అందితే గ్రామాల అభివృద్ధి కోసం వెచ్చించాలని సర్పంచ్‌లు భావించారు. అయితే అందుకు భిన్నంగా ఐదేళ్లయినా ప్రభుత్వ ప్రోత్సాహకం అందలేదు. పంచాయతీలకు గత ప్రభుత్వ హయాంలో సరైన సమయంలో నిధులు విడుదలకాకపోవడంతో గ్రామాల్లో చిన్నపాటి సమస్యను సైతం పరిష్కరించలేని పరిస్థితుల్లో సర్పంచ్‌లు నలిగిపోయారు. చిన్న పంచాయతీలకు సాధారణ నిధులు తక్కువ మొత్తంలో విడుదల అవడంతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయారు. కనీసం నూతన ప్రభుత్వమైనా పట్టించుకుంటే నజరానా నిధులు అందుతాయని సర్పంచ్‌లు భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 225 ఏకగ్రీవ పంచాయతీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 225 గ్రామపంచాయతీల పాలకవర్గాలు ఏకగ్రీవమయ్యాయి. ఒక నల్లగొండ జిల్లాలో 116 గ్రామపంచాయతీల పాలకవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10లక్షల నజరానాతో పాటు మంత్రులు, ఎమ్మెల్యే కోటా నుంచి మరో రూ.5లక్షలు వెచ్చిస్తామని చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 225 ఏకగ్రీమ గ్రామపంచాయతీలు ఉండగా, వాటికి రూ.22.05కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి ఆ వరకు ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికలు వ్యయంతో కూడుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ వ్యయం కూడా ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో ఆ నిధులు మంజూరు చేయలేకపోయిందన్న వాదన రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఒక్కో గ్రామపంచాయతీ నిర్వహణకు కనీసం రూ.1లక్ష వరకు ఎన్నికల ఖర్చు ఉంటుంది. జనాభాకు అనుగుణంగా ఈ ఖర్చు పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా ప్రకటించింది. అయితే వివిధ పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం నజరానా ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రోత్సాహక నిధుల కోసం మొగ్గుచూపి పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది.

ఎలాంటి నిధులు విడుదల కాలేదు

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఎలాంటి నిధులు విడుదల కాలేదు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నాగార్జునసాగర్ సభలో ప్రకటించిన విధంగా జిల్లాలో ప్రతీ గ్రామపంచాయతీకి రూ.20లక్షల చొప్పున మంజూరయ్యాయి. అదేవిధంగా మండల కేంద్రాలకు రూ.30లక్షల చొప్పున నిధులు విడుదల చేశారు.

విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీవో, నల్లగొండ

మునిసిపల్ రగడ

- సూర్యాపేటలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్ల బాహాబాహీ



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రగడ కొనసాగుతూనే ఉంది. అవిశ్వాస తీర్మానాలు అంటూ క్యాంపు రాజకీయాలకు తెరలేపిన ప్రజాప్రతినిధులు.. అవే క్యాంపులకు వెళుతూ చివరికి హ్యాండిస్తున్నారు. ఇలా జిల్లాలోని పలు మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు వీగిపోగా, కొన్ని మునిసిపాలిటీల్లో నెగ్గుతున్నాయి. మునిసిపాలిటీ అధికార పీఠం దక్కించుకునే పనిలో అధికార పార్టీ ఉండగా, చేజారి పోకుండా బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 45వ వార్డు కౌన్సిలర్ ఇంటి ఎదుట రెండు గంటలపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడానికి కారణమంటూ అసమ్మతి కౌన్సిలర్లు ఆమె ఇంటి ఎదుట నిరసనకు దిగారు. ఇంటిపై కోడ్లుగుడ్లు విసిరి, దుమ్మెత్తిపోశారు. అదే సమయంలో అక్కడి వచ్చిన మునిసిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది.

7



ఆందోళన చేస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు

మమ్మల్ని మోసం చేశారు

- కౌన్సిలర్ పావని ఇంటి ఎదుట అసమ్మతి కౌన్సిలర్ల ఆందోళన
- ఇంట్లోకి కోడిగుడ్లు విసిరి.. మట్టిపోసి నిరసన
- కౌన్సిలర్లు అభివృద్ధికి సహకరించాలి : ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



పావనిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

•7లో..

‘కోదాడ’ చైర్‌పర్సన్‌గా ప్రమీల ?

- వైస్‌చైర్మన్‌గా కందుల కోటేశ్వరరావుకు చాన్స్‌దక్కే అవకాశం

బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్లకు విప్ జారీకి ఏర్పాట్లు

- మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అసమ్మతి గళం
- అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- ఇంకా క్యాంపులోనే అసమ్మతి కౌన్సిలర్లు

వచ్చే నెల 5న ‘నల్లగొండ’ చైర్మన్ ఎన్నిక

- చైర్మన్ ఎన్నిక షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- సైదిరెడ్డిపై అవిశ్వాసం నెగ్గడంతో ఎన్నిక అనివార్యం
- చైర్మన్‌గా బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి అవకాశాలు ఎక్కువ



•7లో..



నందికొండలో

నిధులు నిల్

- సమస్యల చట్రంలో మునిసిపాలిటీ
- డీజిల్, నిర్వహణ లేక మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు

•8లో..



యాదగిరిక్షేత్రంలో

•7లో..

భక్తుల కోలాహలం

విద్యారంగమే తొలి ప్రాధాన్యం కావాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

శాలిగౌరారం, జనవరి 28: ప్రభుత్వానికి విద్యారంగమే తొలి ప్రాధాన్యం కావాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం లో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా విస్తృత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యారంగం అడుగులు పడాలన్నారు. గత సర్కారు కేజీ టూ పీజీపై హామీ ఇచ్చి బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచకుండా ప్రభుత్వ విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందరికీ నాణ్యమైన, గుణాత్మక విద్య అందించేలా చొరవ చూపాలన్నారు. అవసరమైన చోట, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నగర ప్రాంతాల్లో పాఠశాలలను నెలకొల్పాలని కోరారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ సమస్యలపై అలుపెరుగని పోరాటానికి పెట్టిన పేరు యూటీఎఫ్ అని, ప్రభుత్వ విద్య పరిరక్షణలో సంఘం ముందుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తన వంతుగా తీసుకెళ్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తుంగతుర్తి ఎమ్మెలే మందుల సామేల్ అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపునిచ్చి పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్. రాములు, రాష్ట్ర కార్యదర్శులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, నల్లగొండ ఉపాధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి, బి.అరుణ, తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లా సమావేశానికి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తరలివచ్చారు. దీంతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. సమావేశానికి ముందు సంఘం పతాకాన్ని ఆవిష్కరించి, ఉపాధ్యాయ ఉద్యమ నేతలకు ఘనంగా నివాళులర్పించారు.

హానికర పరిశ్రమలను తరిమికొట్టాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

గట్టుప్పల్, జనవరి 28: పర్యావరణాన్ని కలుషితం చేసే రసాయనిక పరిశ్రమలను తరిమి కొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల తరబడి వలసలు, కరువు పరిస్థితులతో ఉన్న మునుగోడు నియోజకవర్గంలో ప్రజలకు హాని కలిగించే రసాయనిక పరిశ్రమలకు గత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ పరిశ్రమల నిర్మాణాన్ని నిలిపివేయాలని పలు గ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాటాలు సాగించారన్నారు. గట్టుప్పల్, మునుగోడు మండలం కృష్ణాపురం గ్రామాల్లో ప్రమాదకర రసాయనిక పరిశ్రమలు ఏర్పాటుచేస్తున్నారని, ఇప్పటికే చౌటుప్పల్‌లోని పరిశ్రమలతో పలు రకాల వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలుష్యం కారణంగా ఈ ప్రాంత భూములు భవిష్యత్‌లో వ్యవసాయానికి పనికిరావని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించే చర్లగూడెం రిజర్వాయర్‌ని పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల, చర్లగూడెం రిజర్వాయర్‌ను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లపురాజు రామలింగయ్య, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, నాయకులు రాపోలు సత్తయ్య, చేనేత సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుంజయ, సుధాకర్‌రెడ్డి, పెంటయ్య, ఐతరాజు లక్ష్మయ్య, లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభిస్తున్న యామినిశర్మ, తదితరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆధ్యాత్మికవేత్త సాధినేని యామినిశర్మ

నల్లగొండ, జనవరి 28: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ముందంజలో ఉండాలని ఆధ్యాత్మికవేత్త సాధినేని యామినిశర్మ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ‘మహిళా శక్తి’ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ‘మహిళా శక్తి’ సమ్మేళనాలను వివిధ రంగాలల్లో పని చేస్తున్న మహిళలతో కలిసి నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 13 ప్రాంతాల్లో వీటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో 3,600మంది మహిళలతో సమ్మేళనం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సనాతన ధర్మాన్ని పాటిస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. సమ్మేళనంలో నన్నూరి లత, కత్తుల వెంకటేశం, శ్రీదేవి, కె.స్వప్న, సంధ్యారాణి, రేపాక ఉమ, మద్ది వెన్నెల రెడ్డి, రాయపూడి భవాని, ఇరుగు కోటేశ్వరి, డాక్టర్ ఇటికాల సింధూర, గంట అనూష, అరుణ, భాగ్యలక్ష్మి, ఏచూరి శైలజ, అరుణ జ్యోతి, నూకల సంధ్యారాణి, రేపాక ఉమా, పెరిక తులసి, సత్యావతి, నీలిమారెడ్డి, శిశుమందిర్ అనితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

● భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్

చండూరురూరల్, జనవరి 28: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం చండూరు మండలంలోని కస్తాల గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని, దివ్యాంగులకు పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగుల వాటా తేల్చేంత వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందని అన్నారు. దివ్యాంగులకు ఫిబ్రవరి నెల నుంచి రూ.6వేల పింఛన్ ఇవ్వాలని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని అన్నారు. ప్రతీ దివ్యాంగునికి అంత్యోదయ కారుతో పాటు రూ.10 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు ఆకారపు వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడిపల్లి సుమతి, జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, నాయకులు దోనాల సత్తిరెడ్డి గోగుల శేఖర్‌రెడ్డి, అలివేలు, రేణుక, రవి, బొమ్మరగోని శ్రీకాంత్, ముత్తయ్య, పరమేష్, రాజశేఖర్, ఆంజనేయులు, రాములు, బిక్షం, విజయ పాల్గొన్నారు.

మునిసిపల్ రగడ

మమ్మల్ని మోసం చేశారు

● సూర్యాపేటలో అసమ్మతి కౌన్సిలర్ల ఆందోళన ● ఇంట్లోకి కోడిగుడ్లు విసిరి.. మట్టిపోసి ఆందోళన ● బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట




గండూరి పావని కృపాకర్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు, పావని ఇంట్లో విలేకరులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేటటౌన్, జనవరి 28: అవిశ్వాసం వీగడానికి కారణ మైనారంటూ కౌన్సిలర్ ఇంటిపై కోడిగుడ్లు విసిరి, దుమ్మెత్తిపోశారు అవిశ్వాసానికి తెరలేపిన కౌన్సిలర్లు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మునిసిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నేతల మధ్య మాటామాటా పెరిగి తోపులాట, భౌతిక దాడుల వరకు వెళ్లింది. ఈ ఆందోళనలో 31వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలదిలీప్ రెడ్డి తలకు గాయమైంది. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట మునిసిపాలిటీలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టకిశోర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతూ 16మంది బీఆర్ఎస్ తిరుగుబాటు కౌన్సిలర్లు, 8మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లు, నలుగురు బీజేపీ, నలుగురు బీఎస్పీ, మొత్తం 32మంది కౌన్సిలర్‌లు ఈ నెల 10న అవిశ్వాసానికి తెరలేపారు. 48వార్డులు ఉన్న సూర్యాపేట మునిసిపాలిటీలో 47వ వార్డు కౌన్సిలర్‌కు ఉద్యోగం రాగా కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసింది. దీంతో 47 మంది కౌన్సిలర్లుండగా అవిశ్వాసం నెగ్గాలంటే 2:3 ప్రకారం ఖచ్చితంగా 32 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలపాలి. ఆ దిశగా 32మంది కౌన్సిలర్‌లు అవిశ్వాసానికి 32 మంది కౌన్సిలర్‌లు సంతకాలు చేశారు. ఈ నెల 27న అవిశ్వాసానికి ఓటింగ్ తేదీగా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఉత్తర్వులు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానం రోజు 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అవిశ్వాస తీర్మానంకు మద్దతు ఇవ్వకుండా వెనక్కి తగ్గడంతో అవిశ్వాసం వీగి పాత పాలక వర్గం కొనసాగింది.

ఇంట్లోకి కోడిగుడ్లు.. మట్టిపోసిన అసమ్మతి కౌన్సిలర్లు

అవిశ్వాసం వీగడానికి 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ కారణమంటూ ఆమె ఇంటి ఎదుట అసమ్మతి కౌన్సిలర్లు ఆదివారం ఆందోళన నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన వ్యక్తంచేశారు. మొదట ఇంట్లోకి కోడిగుడ్లు విసిరి.. మట్టి పోశారు. అనంతరం ఇంటి ఎదుట అసమ్మతి కౌన్సిలర్‌లు నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఆందోళన సమయంలో ఇంట్లోనే 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని తన కుమార్తెతో ఉన్నారు. ఆందోళన చేయడంతో తన భర్తకు సమాచారం ఇవ్వగా, అతను కూడా ఆందోళన చేస్తున్న సమయంలోనే ఇంట్లోకి వచ్చి ఉన్నాడు. సుమారు రెండు గంటలకు పైగా ఆందోళన జరిగింది. కౌన్సిలర్ భర్త గండూరి కృపాకర్ వచ్చిన సమయంలో అసమ్మతి కౌన్సిలర్‌లు ఇంట్లోకి వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు గేట్లు వేసి అడ్డుకున్నారు. గేట్లను సైతం తోసుకొని వచ్చే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు వెళ్లనీయకుండా గేటుకు తాళం వేశారు.

నమ్మకద్రోహాన్ని ప్రజలు క్షమించరు : అసమ్మతి కౌన్సిలర్లు

అభివృద్ధిని కోరుతూ అవిశ్వాసానికి ముందుకు వచ్చి స్వార్థంతో అవిశ్వాసానికి వెనక్కి వచ్చిన పావని కృపాకర్‌ను ప్రజలు నమ్మరని అసమ్మతి కౌన్సిలర్‌లు ఆరోపించారు. ఆదివారం పావని ఇంటి ఎదుట ఆందోళన చేసి మాట్లాడారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా అవిశ్వాస తీర్మానం పెట్టినమకు అండగా ఉంటానని నమ్మించి కేవలం డబ్బుల కోసం వెనక్కి తగ్గిన పావని ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. 31 మంది కౌన్సిలర్‌ల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో అసమ్మతి కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

తోపులాటలో కౌన్సిలర్ తలకు గాయం

పావని ఇంటి ఎదుట అసమ్మతి కౌన్సిలర్లు ఆందోళన చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. పావనికి మద్దతుగా అసమ్మతి కౌన్సిలర్‌లతో వాగ్వాదానికి దిగారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్ అసమ్మతి కౌన్సిలర్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వ్యక్తిగత దూషణలు పరస్పరం చేసుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అసమ్మతి కౌన్సిలర్, మునిసిపల్ చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి, సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కౌన్సిలర్ తలకు గాయమై రక్తస్రావమైంది. పట్టణ సీఐ, డీఎస్పీ నాగభూషణం అక్కడికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుం చి పంపించారు. సుమారు 2గం టలకు పైగా ఉత్కంఠ నెలకొంది.



గాయపడిన నిఖిల

బహుజనులకు రాజ్యాధికారం కోసమే.. : పావని

బహుజనులకు రాజ్యాధికారం కోసమే సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి వెనక్కి తగ్గానని పావని అన్నారు. ఆదివారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు ముందుగా సుముఖతతో ఉన్నానని, బీసీ బిడ్డగా తనకు అవకాశం వస్తదని భావించానని తెలిపారు. అయితే తనకు కాకుండా కేవలం అగ్రకులాలకు మునిసిపల్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చేందుకు అసమ్మతి కౌన్సిలర్‌లు మొగ్గు చూపడంతో తాను వెనక్కి తగ్గానని వివరించారు. ఎలాంటి డబ్బులకు లొంగలేదని అన్నారు. త్వరలో బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నానని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు : మునిసిపల్ చైర్‌పర్సన్

కాంగ్రెస్ నాయకులు అసమ్మతి కౌన్సిలర్లతో కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని గండూరి పావని ఇంట్లో ఆమె మాట్లాడారు. దళిత మహిళ చైర్‌పర్సన్‌ను పదవిలో నుంచి దింపడానికి బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లకు డబ్బు ఆశచూపి తనపై ఉసికొల్పారని ఆరోపించారు. వారి ప్రయత్నాలు విఫలంకావడంతో పావని ఇంటిపై దాడులు చేయడమే కాకుండా తనపై, బీఆర్ఎస్ నాయకులు వై. వెంకటేశ్వర్లుపై దాడులు చేశారని తెలిపారు. గండూరి పావని కృపాకర్ ఇంటిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్ఎస్ నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ స్రవంతి, లవకుశ పాల్గొన్నారు.

కౌన్సిలర్లు అభివృద్ధికి సహకరించాలి : జగదీష్‌రెడ్డి

అసమ్మతి కౌన్సిలర్ల ఆందోళన నేపథ్యంలో గండూరి పావని కృపాకర్‌ను ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం రాత్రి ఆమె ఇంటికి వచ్చి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ కౌన్సిలర్లు రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. పావనిపై దాడులు చేయడం సరికాదన్నారు.

కొండపల్లి నిఖిలకు పరామర్శ

సూర్యాపేట సిటీ: సూర్యాపేట పట్టణంలో జరిగిన తోపులాటలో గాయపడిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పరామర్శించారు. ఆమెను సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో చేర్పగా, అక్కడికి వెళ్లి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

కోదాడ చైర్‌పర్సన్‌గా ప్రమీల ?

కోదాడ, జనవరి 28: కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా 4వ వార్డు కౌన్సిలర్ సామినేని ప్రమీల, వైస్‌చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావులను ఏకగ్రీవం ఎన్నుకోనున్నట్లు సమాచారం. శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్‌చైర్మన్ వెంపటి పద్మపై అవిశ్వాస సమావేశాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో నిర్వహించారు. కోదాడ మునిసిపాలిటీలో 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో 25మంది బీఆర్ఎస్ నుంచి, ఎనిమిది మంది కాంగ్రెస్, ఒకరు టీడీపీ, ఒకరు సీపీఐ నుంచి గెలిచారు. అవిశ్వాసానికి 33 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఒకరు ఎన్నికలకు దూరంగా ఉండగా, మరొకరు ఇటీవల మృతిచెందారు. ఇద్దరు బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కాగా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 29మంది ఓటు వేయగా వ్యతిరేకంగా నలుగురు ఓటువేశారు. దీంతో అవిశ్వాస వివరాలను ఎన్నికల సంఘానికి అందించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం నుంచి ఎన్నిక ప్రక్రియకు ఆదేశాల అనంతరం వారిద్దరిని ఎన్నుకోవటానికి కౌన్సిలర్లు నిర్ణయించినట్లు సమాచారం. అంతేగాక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి వారికి స్పష్టమైన హామీ ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలో జనరల్ స్థానం నుంచి గెలిచిన శిరీష

కోదాడ మునిసిపాలిటీకి 2020లో జరిగిన ఎన్నికల్లో చైర్‌పర్సన్‌గా జనరల్ మహిళకు కేటాయించారు. కాగా 2020లో జరిగిన ఎన్నికల్లో 35 కౌన్సిలర్లకుగాను బీఆర్ఎస్ 25 స్థానాలు గెలుచుకుంది. 4వ వార్డునుంచి గెలిచిన సామినేని ప్రమీల(జనరల్) చైర్‌పర్సన్‌గా అందరు భావించారు. కానీ 2వ వార్డు నుంచి గెలిచిన వనపర్తి శిరిష(బీసీ) చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. దీంతో ప్రమీలకు చైర్‌పర్సన్ పదవి దక్కలేదు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సహకరించాలని, ఎన్నికల్లో గెలిస్తే, చైర్‌పర్సన్ పదవి ప్రమీలకు ఇస్తానని పార్టీ హామీ ఇచ్చింది. దీంతో బీఆర్ఎస్ నుంచి ప్రమీల కాంగ్రెసులోకి మారారు. ఎన్నికల్లో కాంగ్రెసు విజయం సాధించింది. అంతేగాక ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి ఎనిమిది మంది కౌన్సిలర్లు కాంగ్రెసులోకి మారటం, మరో 11 మంది కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వటంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధంచేశారు. అవిశ్వాసం నెగ్గటంతో ప్రమీల చైర్‌పర్సన్ పదవికి మార్గం సుగమం అయినట్లు సమాచారం. కోటేశ్వరరావును వైస్ చైర్మన్‌గా ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ మునిసిపల్

కౌన్సిలర్లకు విప్ జారీకి ఏర్పాట్లు

మోత్కూరు, జనవరి 28: మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి మేఘారెడ్డిపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ చేయనున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ సావిత్రిపై ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ఈ నెల 20న కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు అందించి, వారు క్యాంపునకు వెళ్లిన విషయం విదితమే. ఫిబ్రవరి 9న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆదేశిస్తూ బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్లకు విప్ జారీ చేయనున్నారు. పార్టీ అధిష్ఠానం విప్ జారీచేసే అధికారాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డికి ఇచ్చినట్లు తెలిసింది. ఆయన ఈ నెల 29, 30 తేదీల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ పత్రాలు అందించనున్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నందున వారికి విప్ పత్రాలను వాట్సప్ ద్వారా గాని, ఇంటి వద్ద గాని అందించే అవకాశముందంటున్నారు. ఇదిలా ఉండగా పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన ఆ కౌన్సిలర్లు పార్టీ జారీ చేసిన విప్‌ను పాటిస్తారా? లేదా, విప్ పాటించకుంటే తదుపరి పరిణామాలేమిటన్నది వేచి చూడాల్సిందే.

వచ్చే నెల 5న నల్లగొండ చైర్మన్ ఎన్నిక

రామగిరి, జనవరి 28: నల్లగొండ మునిసిపల్ చైర్మన్ ఎన్నిక షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విడుదల చేశారు. నల్లగొండ మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. వచ్చేనెల 3వ తేదీలోపు చైర్మన్ ఎన్నికకోసం ప్రత్యేక సమావేశానికి సంబంధించిన ప్రకటనను విడుదల చేస్తూ కౌన్సిల్ సభ్యులకు సమాచారం అందించాలని కలెక్టర్ హరిచందనకు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 6వ తేదీన కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న బుర్రి శ్రీనివాస్ రెడ్డికి చైర్మన్ పదదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైస్ చైర్మన్‌గా ఉన్న అబ్బగోని రమేష్‌గౌడ్ ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

పెదవీడు లిఫ్టు వద్ద కాపర్ వైర్ చోరీ



మఠంపల్లి, జనవరి 28: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని రామచంద్రపురం తండా సమీపంలో గల కృష్ణానదిపై ఏర్పాటు చేసిన పెదవీడు లిఫ్టునకు సంబంధించిన కాపర్ వైరు(కేబుల్ వైరు)ను చోరీ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మఠంపల్లి ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. పెదవీడు లిఫ్టు వద్ద ఉన్న కాపర్ వైరు (కేబుల్ వైరు) గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పెదవీడు లిఫ్టు చైర్మన్ అన్నెం నర్సిరెడ్డి ఈనెల 25న ఫిర్యాదు చేశారు. లిఫ్టు చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని విచారణ చేయగా గరిడేపల్లి మండలం కొండయ్యగూడెంకు చెందిన మాతంగి సురేష్ అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించామని, ఆయనపై కేసు నమోదు చేసి మరి కొందరు అనుమానితులను విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగలించిన 50మీటర్ల కాపర్ వైరు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మఠంపల్లిలో జర్మనీ దేశస్తులు

● శుభవార్త దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు



శుభవార్త దేవాలయంలో ప్రార్థనల్లో పాల్గొన్న జర్మనీ దేశస్తులు

మఠంపల్లి, జనవరి 28: దక్షిణ తెలంగాణలోనే అతిపెద్ద చర్చిగా పేరుగాంచిన మఠంపల్లి శుభవార్త దేవాలయాన్ని జర్మనీ దేశానికి చెందిన 30మంది బృందం సందర్శించింది. ఫాదర్ థామస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ విశిష్టత, ప్రాముఖ్యతను స్థానిక ఫాదర్ మార్టిన్ పసలను అడిగి తెలుసుకున్నారు. శుభవార్త దేవాలయంలో జరిగిన దివ్యబలి పూజల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలతోపాటు చిన్నారులు చేసిన డ్యాన్సులను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ఫాదర్ ఏరంరెడ్డి రజనీకుమార్‌రెడ్డి, అల్లం బాల్‌రెడ్డి, మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి, గాలి చిన్నపరెడ్డి, ఆదూరి లుర్థుమారెడ్డి, మారెడ్డి తిరుమల్‌రెడ్డి, అల్లం జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సాయిఅభిజ్ఞ





జిల్లా జట్టు తరుపున క్రీడాకారులతో సాయిఅభిజ్ఞ (ఇన్‌సెట్‌లో) అభిజ్ఞ

తిరుమలగిరి(సాగర్), జనవరి 28: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి అండర్ - 14 తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టెన్‌గా మండల కేంద్రానికి చెందిన వల్లవాయి సాయిఅభిజ్ఞ ఎంపికైంది. నల్లగొండ జిల్లా కేం ద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న సాయిఅభిజ్ఞ కొన్నేళ్లుగా కబడ్డీలో విశేషంగా రాణిస్తుంది. దీంతో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్, తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఈ నెల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా రాజవరంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా ఆమెను నియమించింది. 2022 నవంబరులో భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసానిలో నిర్వహించిన 6వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్‌లో బాలికల విభాగంలో జిల్లా జట్టు ప్రథమస్థానం పొందడంలో ఆమె ఎంతో ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా 2022 డిసెంబరులో మంచిర్యాల జిల్లా కేంద్రంలో 32వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో పొందడంలో ఆమె తన ప్రతిభను చాటింది. 2023 డిసెంబరులో నిజామాబాద్ జిల్లా ముస్తాపూర్‌లో నిర్వహించిన 70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానం పొందింది. ఈ పోటీల్లో సాయిఅభిజ్ఞ జిల్లా జట్టు తరుపున పాల్గొని తన ప్రతిభను చాటారు. అదేవిధంగా 2024 జనవరిలో జనగామ జిల్లా ధర్మకంచెలో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టు తరుపున ఆమె పాల్గొని రాణించింది. 2024 జనవరిలో సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన 49వ జూనియర్ ఇంట ర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలో ఆమె జిల్లా జట్టు తరుపున పాల్గొన్నది. దీంతో ఈ క్రమంగా రాణిస్తూ జిల్లా జట్టును గెలిపించడంలో కృషి చేస్తున్న సాయిఅభిజ్ఞ తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా అధికారులు ఎంపికైనట్లు కోచ్‌లు కాశీ, ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు సాయిఅభిజ్ఞను అభినందించారు.

కూలీల ఆటో బోల్తా

● మహిళ మృతి
● 14 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

డిండి, జనవరి 28: పనులకు వెళ్లి తిరిగి వస్తున్న కూలీల ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళా కూలీ మృతిచెందగా 14 మందికి గాయాలయ్యాయి. డిండి ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.... మండలంలోని ఎర్రారం గ్రామానికి చెందిన వ్యక్తి ఆటోలో కె.గౌరారం, జాల్‌తండా గ్రామాలకు చెందిన 15 మంది కూలీలు ఆదివారం మిరపకాయలు ఏరేందుకు ఉదయం శాంతిగూడెం గ్రామానికి ఆటోలో వెళ్లారు. పని ముగించుకొని సాయంత్రం తిరుగు పయనమయ్యారు. దేవరకొండ - డిండి ప్రధాన రహదారిపై ఉన్న తంబాలబండ వద్ద ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న జాల్‌తండాకు చెందిన రాత్లావత్ ముత్యాలి (40) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న 14 మందికి గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్థ్యానికి మించి ఆటోలో కూలీలు ప్రయాణించడం వల్లే ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. ముత్యాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు ముత్యాలికి భర్త దూత్యా, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

దేవరకొండ, కొండమల్లేపల్లి సీఐలు బదిలీ

దేవరకొండ, జనవరి 28: దేవరకొండ, కొండమల్లేపల్లి సీఐలు బదిలీ అయ్యారు. దేవరకొండ సీఐ నాగభూషణ్‌రావు వనపర్తికి బదిలీకాగా నాగర్‌కర్నూల్ డీసీఆర్‌బీలో సీఐగా పనిచేస్తున్న నర్సింహులు దేవరకొండ సీఐ గా నియమించారు. కొండమల్లేపల్లి సీఐ రా ఘ వేందర్‌రెడ్డి రాచకొండకు బదిలీకా గా ఆయన స్థానంలో హైదరాబాద్ ఇంటిలిజెన్స్‌లో సీఐగా పనిచేస్తున్న ధ నుంజయ కొండమల్లేపల్లి సీఐగా ని యమిస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మల్టీజోన్ అధికారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మద్యం పంపిణీ చేస్తే గ్రామ బహిష్కరణ

గట్టుప్పల్, జనవరి 28: మండలంలోని వెల్మకన్నె గ్రామంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో గ్రామంలో ఏ పార్టీ అభ్యర్థులైనా ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేస్తే వెంటనే ఆ నాయకులను గ్రామం నుంచి బహిష్కరిస్తామన్నారు. ఆదివారం వెల్మకన్నె గ్రామంలో గ్రామస్థులతో పాటు అఖిలపక్ష పార్టీల నాయకులు సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేయడంతో పాటు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ ఇక నుంచి గ్రామంలో ఏ ఎన్నికలు జరిగినా డబ్బుకు.. మద్యానికి తావు లేకుండా ప్రజలందరూ స్వచ్ఛందంగా ఓట్లు వేసే విధంగా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు చెందిన వ్యక్తులు కూడా మద్యం, డబ్బులు ఓటర్లకు పంపిణీ చేస్తే వెంటనే ఆ గ్రామం నుంచి వెలేస్తామని ప్రజలు, నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు చలమల్ల వెంకట్‌రెడ్డి, కంపే దుర్గయ్య, రావుల రమేష్, టేకుమట్ల శ్రీరాములు, శ్రీకాంత్, వనం రమేష్, చలమల్ల యాదగిరిరెడ్డి, భీమనపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

యాదగిరిక్షేత్రంలో భక్తుల కోలాహలం

● కిటకిటలాడిన ఆలయ తిరువీధులు ● కిక్కిరిసిన దర్శన క్యూలైన్లు..సేవా మండపాలు ● ధర్మదర్శనాలకు నాలుగు గంటలు.. ప్రత్యేక దర్శనాలకు రెండు గంటలు




స్వామివారికి ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకుడు, యాదగిరికొండపై భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, జనవరి 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. వారాంతపు సెలవు రోజుకావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తమ ఇష్టదైవాల దర్శనాలు, మొక్కుపూజల నిర్వహణకోసం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తుల హరిహరనామ స్మరణతో యాదగిరికొండ ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించింది. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ తిరువీధులు, సేవా మండపాలు, ఘాట్‌రోడ్, పట్టణ ప్రధానవీధులు, గండి చెరువు పరిసర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. కొండకింద కల్యాణకట్టలో మొక్కుతలనీలాలు సమర్పించిన భక్తులు లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారి ధర్మదర్శనానికి నాలుగు గంటలు.. ప్రత్యేక టికెట్ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.. 45వేల మందికి పైగా భక్తులు యాదగిరిక్షేత్రాన్ని సందర్శించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో వాహనాల్లో తరలిరావడంతో ఆలయ ఘాట్ రోడ్, పట్టణంలో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్, ఎస్పీఎఫ్, పట్టణ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల సందడి కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో స్వయంభువులను దర్శించుకున్న భక్తులు ఆలయ తిరువీధుల్లో పిల్లాపాపలతో సేదతీరారు. ఇదిలా ఉండగా యాదగిరికొండకు సమీపంలోని రాయిగిరి చెరువు ప్రాంతంలోని గార్డెన్‌లో భక్తులు పిల్లాపాపలతో సేదతీరారు.

స్వయంభువులకు శాస్త్రోక్తంగా నిత్యారాధనలు

ఏకశిఖరవాసుడు స్వయంభు పాంచనారసింహుడికి ఆదివారం నిత్యపూజా కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, బిందెతీర్థంతో అర్చకులు నిత్యారాధనలు చేశారు. గర్భాలయంలోని మూల మూర్తులకు వేదమంత్ర పఠనాలతో నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో చేపట్టిన అర్చకులు ఆర్జితసేవల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ప్రధానాలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తరాలు కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలో స్ఫటిక మూర్తులకు నిత్యపూజలు, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా రూ.57.45లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

స్వామి సేవలో గవర్నర్ సెక్రటరీ సురేంద్రమోహన్

గవర్నర్ సెక్రటరీ సురేంద్రమోహన్ కుటుంబసమేతంగా లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. పూజలనంతరం అర్చకులు ఆశీర్వచనం అందజేశారు.

ఏఎస్ఐ సోమయ్య

అంత్యక్రియలు పూర్తి

అడ్డగూడూరు, జనవరి 28 : ఆస్తి పంపకాలు జరగకపోవడంతో నిలిచిన యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన చిప్పలపల్లి సోమయ్య(58) అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. హైకోర్టులో ఏఎస్ఐ(టీఎస్ఎస్పీ ఎఫ్)తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న సోమయ్య అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో మృతిచెందాడు. సోమయ్యకు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య ఎల్లమ్మ కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి కుమారుడు ఉన్నారు. ఆమె మృతి చెందాక విజయ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమయ్య మృతదేహాన్ని శనివారం తెల్లవారుజామున స్వగ్రామమైన కోటమర్తికి తీసుకురాగా ఆస్తిలో సమాన హక్కు కావాలని మొదటి భార్య కుమారుడు, బంధువులు పట్టుబట్టారు. రెండో భార్య విజయ అందుకు నిరాకరించడంతో వివాదం మొదలై అంత్యక్రియలు నిలిచాయి. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం మరోసారి ఇరు కుటుంబ సభ్యులు చర్చించారు. దశదిన కర్మ పూర్తయిన మరుసటి రోజున ఆస్తి పంపకాల విషయమై మాట్లాడుకునేందుకు పెద్దమనుషుల మధ్య అంగీకరించడంతో మొదటి భార్య కుమారుడు సాయిబాబా అంత్యక్రియలు పూర్తి చేశారు.

పిల్లల మనోవికాసానికి కథలు దోహదం

● డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి

నల్లగొండ, జనవరి 28: పిల్లల మనోవికాసం, సమగ్రాభివృద్ధికి కథలు ఎంతగానో దోహదం చేస్తాయని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన 'బహుమతి' బాలల కథల సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. బాల సాహిత్యం విరివిగా రావాల్సిన అవసరం ఉందన్నారు. బహుమతి కథలో ఉన్న నైతిక విలువలు నేటి తరానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ బహుమతి కథలు బాలలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు మునాసు వెంకట్, మేరెడ్డి యాదగిరిరెడ్డి, అంబటి వెంకన్న, డాక్టర్ లేఖనం దాస్వామి, బైరెడ్డి కృష్ణారెడ్డి, భద్రయ్య, మాదగోని శంకరయ్య, పెరమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, మేకల ఉమాకర్‌రెడ్డి, హసేనా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

చింతపల్లి, జనవరి 28: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎండీ శంషుద్దీన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తీదేడు రెవెన్యూ శివారు పరిధిలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 389లో కొంత భూమిని ఇతరులు ఆక్రమించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆదివారం మండల సర్వేయర్‌తో 389లో ఉన్న ప్రభుత్వ భూమిని జేసీబీ ద్వారా హద్దులు గుర్తించినట్లు తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

వేములపల్లి, జనవరి 28: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా కార్యకర్తలు పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో పలు సమస్యలు దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్నా పాలకులు మాత్రం అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండలకేంద్రం శివారులో పలు రైస్‌మిల్లులు ఏర్పడుతూ కాలుష్యమయంగా మారుతున్నా మరికొన్ని మిల్లుల నిర్మాణానికి అనుమతించడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలన్నింటినీ త్వరితగతిన అమలుపరిచి పేద, మధ్య తరగతి వర్గాల వారికి అండగా నిలవాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, నాయకులు పుట్టల రాములు, పల్లా వెంకన్న, పుట్టల కృష్ణయ్య, వల్లంపట్ల వెంకన్న, పద్మ, సత్యం, కొండయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యాక్ట్‌ను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజుభట్

నల్లగొండ, నల్లగొండ రూరల్, జనవరి 28: సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) సంఘం రాష్ట్ర జనరల్ కార్యదర్శి ఐ.రాజుభట్ కోరారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్‌కు చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్ పనిచేసేందుకు ఉన్న అడ్డంకులను తొలగించాలని కోరారు. మందులపై ఉన్న జీఎస్టీని తొలగించి ధరలు తగ్గించాలని కోరారు. అమ్మకాల కోసం మెడికల్ రిప్రజెంటేటివ్స్‌ను వేధించవద్దని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుపల్లి నిరంజన్, సీఐటీయూ వైస్ ప్రెసిడెంట్ తుమ్మల వీరారెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ దండెంపల్లి సత్తయ్య, రాష్ట్ర నాయకులు కోట సుధాకర్, రావుల రవి, రమేష్, జీవన్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయాలి



కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సత్తిరెడ్డి

నల్లగొండ రూరల్ జనవరి 28: ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ డిపోను ఆదివారం సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్తిరెడ్డి మాట్లాడుతూ 2017-21 వరకు 2 వేతనాల సవరణ జరగకపోవడం వల్ల ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం అమలుద్వారా కార్మికులకు పెరిగిన పని భారాన్ని తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సంఘం నాయకులు కందుల నర్సింహ, బత్తుల సుధాకర్, అద్దంకి నర్సింహ, చంద్రమౌళి, నర్సింహయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి'

నల్లగొండ, జనవరి 28: నామినేటెడ్ పోస్టుల్లో ప్రభుత్వం బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో జరిగిన సీట్ల సర్దుబాటు వల్ల వివిధ కారణాలతో కొన్ని చోట్ల బీసీలకు టికెట్లు లభించలేదని అన్నారు. అధికారంలోకి వస్తే తగిన ప్రాధాన్యమిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం బీసీలకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'నందికొండ'కు నిధులు నిల్





మునిసిపల్ కార్యాలయంలోనే నిలిచిన చెత్త సేకరణ వాహనాలు (ఇన్‌సెట్‌లో) నాగార్జునసాగర్ పట్టణం

- సమస్యల చట్రంలో మునిసిపాలిటీ
- డీజిల్, నిర్వహణ లేక మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు
- వీధుల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నాగార్జునసాగర్, జనవరి 28: "రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఏర్పడిన మునిసిపాలిటీ నందికొండ మునిసిపాలిటీ" 2018లో నాగార్జునసాగర్‌ను నందికొండ మునిసిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నప్పుడు నాటి సీఎం కేసీఆర్ అన్న మాటలు నిజమే. ఎందుకంటే నందికొండ మునిసిపాలిటీ అన్నింటా ప్రత్యేకమేనని అనిపిస్తుంది. రాష్ట్రంలో పైసా ఆదాయం లేని ఏకైక మునిసిపాలిటీ నందికొండే అని చెప్పుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఏదైనా ఒక మునిసిపాలిటీని ఏర్పాటు చేయాలంటే ఆ గ్రామం లేదా పట్టణం కనీసం గ్రామ పంచాయతీ అయినా అయి ఉండాలి. కానీ నందికొండ మునిసిపాలిటీ మాత్రం ఏది కాకుండానే కేవలం ఓట్లు వేయించుకోవడానికి మాత్రమే ఏకంగా మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు.

అన్నీ ఎన్నెస్పీ పరిధిలోనే....

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ నిర్వహణ అంతా సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉండేది. సాగర్‌లో ఉన్న హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో నీటి సరఫరా, అంతర్గత రోడ్లు, మురుగు నీటి వ్యవస్థ, విద్యుత్ సరఫరా అంతా ఎన్నెస్పీ నిధులతో చేపట్టేవారు. కానీ రాష్ట్ర విభజన అనంతరం 2018 ఆగస్టు నెలలో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం సాగర్‌లో ఉన్న రెండు కాలనీలను ఎన్నెస్పీ పరిధి నుంచి నందికొండ మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు. సాగర్ కాలనీల్లో ఉన్న నివాస గృహాలు అన్ని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కట్టినవే కావడంతో ఆ ఆస్తి అంతా ఎన్నెస్పీకే చెందుతుంది. నివాస గృహాల అద్దెలు సైతం ఎన్నెస్పీలో బీఅండ్ఆర్ విభాగం ఇంజనీర్లు వసూలు చేస్తారు. అంతే కాకుండా సాగర్ కాలనీల్లో పదుల సంఖ్యలో మాత్రమే కిరాణా దుకాణాలు ఉంటాయి. వ్యవసాయ భూములు, వ్యవసాయ కూలీలు కానీ ఎవరూ ఉండరు. దీంతో నందికొండకు వచ్చే ఆదాయం నయా పైసా కూడా లేదు. ఆదాయం లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోక కాలనీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

2020లో మొదటిసారిగా ఎన్నికలు

సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఆరు దవాబ్దాలు దాటిన తర్వాత మొదటి సారి 2020 జనవరి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు. నాటి నుంచి రెండు కాలనీల్లో కలిపి 12 వార్డులకు కౌన్సిలర్లు ఉన్నారు. కానీ ఏ పని చేయాలన్న ఆదాయం లేకపోవడంతో కాలనీల్లోని వార్డుల్లో పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా అధ్వానంగా తయారైంది. 2021లో సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ నిధులు నుంచి వేతనాలు ఇస్తూ అవుట్ సోర్సింగ్‌లో పారిశుధ్య కార్మికులను నియమించడంతో పాటు, వీధుల్లో చెత్తను సేకరించడానికి నాలుగు ఆటోలను కొనుగోలు చేశారు. వాటికి డీజిల్, సిబ్బంది వేతనాలు కలెక్టర్ నిధులతో పాటు, ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులతో ఇప్పటి వరకు నెట్టుకొచ్చారు. మునిసిపాలిటీకి పైసా ఆదాయం లేకపోవడంతో ఇక్కడ ఏ ఒక్క కమిషనర్ కూడా ఏడాది, ఆరు నెలల కంటే ఎక్కువగా పనిచేయలేదు. మునిసిపాలిటీ ఏర్పడిన ఆరేళ్లలో ఆరుగురు కమిషనర్లు వచ్చి వెళ్లారు. ప్రస్తుతం హాలియా మునిసిపాలిటీ కమిషనర్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

మూలనపడిన చెత్తసేకరణ వాహనాలు

రెండు నెలలుగా వీధుల్లో చెత్త సేకరించే వాహనాలకు డీజిల్ లేకపోవడంతో పాటు మరమ్మతులకు డబ్బులు లేక ఆ వాహనాలను కార్యాలయంలోనే నిలిపి ఉంచారు. అంతేకాకుండా నాలుగు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేదు. దీంతో వీధులల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది.

కాలనీల్లో ప్రబలుతున్న దోమలు

కాలనీల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు ప్రబలుతున్నాయి. అసలే చలికాలం సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు దోమల బారిన పడి విషజ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదాయం లేక భారంగా నిర్వహణ

నందికొండ మునిసిపాలిటీలో ప్రైవేట్ ఆస్తులు అంటూ ఏమీ లేవు. అన్ని ప్రభుత్వ నివాసగృహాలే కాబట్టి ప్రాపర్టీ ట్యాక్స్ వంటివి వసూలు లేదు. దీంతో ఎక్కడ నుంచి ఆదాయం వచ్చే వీలు లేకుండాపోయింది. నిర్వహణ భారంగా మారింది. పారిశుధ్య పనులకు కూడా పైసలు లేవు. నిధులు కావాలని ప్రభుత్వానికి నివేదకలు పంపాము. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే వాహనాలు మరమ్మతులు చేయించి పారిశుధ్య కార్యక్రమాలు చేపడతాం.

-కె. వీరారెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



గదరాలతండాలో బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, జనవరి 28: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గదరాలతండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసి చూపిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించి ప్రజలపై పెనుభారం మోపిందని విమర్శించారు. మండలంలోని కందుకూరు రోడ్డు నుంచి శాంతిగూడెం గ్రామానికి, చెర్కుపల్లి బీటీ రోడ్డు నుంచి గదరాలతండాకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం చెర్కుపల్లి గ్రామంలో వేమిరెడ్డి రాజిరెడ్డి వెంకటనర్సమ్మ పేరున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వావిల్‌కోల్, టి.గౌరారం, ఖానాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభించారు. ప్రతాప్‌నగర్ గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన, సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాధవరం సునీతజనార్థన్‌రావు, ఎంపీడీవో డానియెల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఇందిరా భాస్కర్‌రెడ్డి, దామోదర్‌రావు, సరోజ, వేమిరెడ్డి సుధామణి, శేఖర్‌రెడ్డి, యాదగిరిరావు, లక్ష్మి, యాసాని రజిత, విజేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జర్పుల లక్ష్మి, బి.వెంకటరమణ, బుచ్చిరెడ్డి, రాంకిరణ్, వెంకటయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

దేవరకొండ: ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 సంఘం క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈటూరి రజనీకాంత్, ఎంపీపీ జాన్‌యాదవ్, సాయిలు, రవిగౌడ్, జయప్రకాష్ నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి

కనగల్, జనవరి 28: జనగామ జిల్లా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ఆమె అత్తగారు ఝాన్సీ రెడ్డి ఇతర కుటుంబసభ్యులు ఆదివారం దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. కాగా అర్చకులు అమ్మవారి ఆశీర్వచనాలను, తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఓ శుభకార్యానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు చీదేటి వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి, సైదులుగౌడ్, పద్మ, షబ్బీర్ పాల్గొన్నారు.

ఆపద్బాంధవ్ ఫౌండేషన్‌కు సేవారత్న పురస్కారం

నార్కట్‌పల్లి, జనవరి 28: నార్కట్‌పల్లికి చెందిన ఆపద్బాంధవ్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు సేవారత్న పురస్కారం లభించింది. మిర్యాలగూడలో జనయేత్రి ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్‌కు అందజేశారు. నాలుగేళ్లుగా ఆపదలో ఉన్న ఎంతోమందికి రక్తదానం చేసి ఆదుకున్నందున ఆపద్బాంధవ్ ఫౌండేషన్‌కు పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పొట్టపంగ గణేష్, సభ్యులు దూదిమెట్ల సాయికుమార్, కంచర్ల రాజు, ఎకాంత్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా దానయ్య

చండూరు, జనవరి 28: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా గురజాల దానయ్య ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గురజాల దానయ్య, ప్రధాన కార్యదర్శి ఇమామ్‌తో పాటు ఏడుగురు సభ్యులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిలుముల బాల్‌రెడ్డి, కొడదాల శంకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతంతో పాటు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

తమ ఎన్నికకు సహరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల కృష్ణారెడ్డి, ఆదిమల్ల మనిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీని ప్రధానిని చేయాలి : బూర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

చిట్యాలరూరల్, జనవరి 28: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి మూడోసారి నరేంద్రమోదీని దేశ ప్రధానిగా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. చిట్యాల మండలం నేరడ గ్రామంలో ఆదివారం పార్టీ జెండాతో పాటు వికసిత్ సంకల్ప్ భారత్ క్యాలెండర్ వారు ఆవిష్కరించి మాట్లాడారు. పీఎం మోదీ దేశంలోని పేద, సామాన్య ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మోదీ హయాంలో దేశం పురోభివృద్ధిని సాధించిందని, దేశాభివృద్ధి కోసం ఆయన అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో దేశంలోనే కాకుండా ఇతర దేశాలకు కూడా వ్యాక్సిన్ అందించిన ఘనత మోదీకే దక్కిందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు వికసిత్ సంకల్ప్ భారత్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, మాడూరి ప్రభాకర్‌రావు, పాపని వనజ, గంజి గోవర్ధన్, వరికుప్పల నర్సింమ, పొట్టబత్ని గోపాలకృష్ణ, పొట్టబత్తిని శ్రీను, మిర్యాల మోహన కృష్ణ, గిరి, వెంకన్న, కూరెళ్ల శ్రీను, పల్స శ్రీను, పబ్బు వెంకన్న, కన్నెబోయిన మహాలింగం, మాస శ్రీను, నరేష్, పాపని వాసుదేవ్, వెంకటేష్, అనిల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కార్ట్ ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలి

● సీఏపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



సీఏపీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 28: క్యాష్ ఎస్కార్ట్ ఉద్యోగాలను స్థానికులనే ఇవ్వాలని సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీఏపీఎఫ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్యాష్ ఎస్కార్ట్ ఉద్యోగాలను స్థానికులకు కాకుండా సెక్యూరిటీ ఏజెన్సీలు బీహార్ నుంచి వచ్చిన గన్‌మన్‌లను నియమించుకోవడం వల్ల స్థానికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. స్థానికులకు అవకాశం కల్పించాలని జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, పట్టణంలో ఎక్స్‌సీఏపీఎఫ్ ఉద్యోగుల సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించడానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేయాలని అన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన సీఏపీఎఫ్ ఉద్యోగులను అభినందించారు. సమావేశంలో సంఘం ముఖ్య సలహాదారుడు ఎస్ఎన్‌రెడ్డి, ఉమెన్‌వింగ్ ఉపాధ్యక్షురాలు టి.నర్సమ్మ, జిల్లా అధ్యక్షుడు మన్సూర్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేసి కాల్వల ద్వారా చందంపేట, నేరేడుగొమ్ము మండలాలలోని చెరువులు, కుంటలను నింపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ కోరారు. చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో చెరువులు, కుంటలు నీరులేక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేసి కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపితే వేసవిలో పశువులు, రైతులకు నీటి సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే నీటి పారుదలశాఖ అధికారులు డిండి ప్రాజెక్టు నీటిని చెరువులకు విడుదల చేయాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలో కులగణన చేపడతామని ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని బీసీ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపడతామని ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. కులగణన అనంతరమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీకాంత్, శివ, ఏడుకొండలు, శ్రీనివాస్, వంశీ, మురళీ, రవితేజ, సందీప్, మధు పాల్గొన్నారు.

కట్టంగూరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ ఫిజీషియన్ అంకాలజిస్ట్ కంచర్ల హరీష్ అన్నారు. మండలకేంద్రంలోని సాందీపని పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 350 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ మాధవాచారి, గైనకాలజిస్ట్ హబిత, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, లింగయ్య, హెచ్ఎం రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: ర్యాష్ డ్రైవింగ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏఐఎంఐఎం నాయకులు పోలీసులను కోరారు. ఆదివారం టూటౌన్ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్‌ఫారుక్ మాట్లాడుతూ రాత్రి వేళలో పట్టణ రహదారులపై కొందరు వాహనదారులు ర్యాష్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నారని తెలిపారు. బైక్ సైలెన్సర్లను మార్చడం వలన అధిక శబ్ధం చేస్తూ వాహనాలు నడపడంతో చిన్నారులు, వృద్ధులు భయపడుతున్నారని అన్నారు. పట్టణశివారు ప్రాంతాల్లో మద్యం తాగడం, గంజాయి వాడకంపై నిఘాపెట్టి నియంత్రణ చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఎంపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రగిరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు మోసిన్‌అలీ, గౌస్, సమీ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: కౌండిన్య గౌడ సంఘం జిల్లా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన యడవెల్లి శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్ నియామకంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మిర్యాలగూడ రూరల్: ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న శ్రీనివాస్ నగర్ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శ్రీనివాస్‌నగర్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులతో గ్రామాన్ని అభివృద్ధిని చేసి రాష్ట్రంలో అగ్రభాగాన నిలిపి 20 అవార్డులు సాధించిన ఘనత సర్పంచ్ వెంకటరమణ చౌదరికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుజాత, కార్యదర్శి అనిత, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: షెడ్యూల్ కులాల ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఎస్సీ ఉద్యోగ సంఘం కార్యాలయంలో ఆదివారం క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ ఆశయసాధనకు ఉద్యోగులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాడ్గుల శ్రీనివాస్, బాబురావు, నాయకులు అంజయ్య, మహేష్, కృష్ణ, రాంబాబు, శైలజ, శ్రీరాములు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● బంజార ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, స్కైలాబ్‌నాయక్, ఉద్యోగ సంఘం నాయకులు దశరథనాయక్, గోపినాయక్, రవినాయక్, చౌహాన్, శ్రీను నాయక్, ధర్మానాయక్ పాల్గొన్నారు.

డిండి: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు డిండి మండలం నగరదుబ్బ తండాకు చెందిన కరంటోత్ రాకేష్ ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్‌లోని కాసాని జ్ఞానేశ్వర్ కబడ్డీ అకాడమీలో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 20 విభాగంలో తెలంగాణ జట్టు నుంచి రాకేష్ ఆడనున్నాడు. ఈ నెల 11, 12, 13, 14 తేదీల్లో సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి నీట్ కబడ్డీ పోటీల్లో రాకేష్ అత్యంత ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపిక చేశారు. మండలకేంద్రానికి చెందిన రాకేష్ ఇంటర్మీడియట్ పూర్తిచేసి హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో రాకేష్ కబడ్డీలో శిక్షణ పొందుతున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు.

కనగల్: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ సన్నిధిలో గుర్రంపోడు మండలం కొప్పోలు జడ్పీ హైస్కూల్ ఎస్సెస్సీ 1999-2000 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులకు శాలువాలు కప్పి, పూలమాలతో సత్కరించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో సింగం ప్రవీణ్, హరిబాబు, శేఖర్, దయానంద్, పరమేష్, విజయ్, రాధా, శ్రీదేవి, వెంకటేష్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: ప్రజల హక్కుల కోసం పోరాడిన అమరవీరుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సీపీఎం సీనియర్ నాయకుడు మహిమూద్ ప్రథమ వర్ధంతిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థి దశనుంచి పేదల హక్కుల కోసం మహిమూద్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, గౌతమ్‌రెడ్డి, రామ్మూర్తి, పరశురాములు, సత్యనారాయణ, గోవర్ధన్ పాల్గొన్నారు.